


# సత్యవాక్యము

# The Word of Truth

## క్రైస్తవ మాసపత్రిక

APRIL - 2010

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2010 మార్చి 2,3,4 తేదీలలో తూర్పుగోదావరి రామచంద్రపురం రాజ రాజబాబు నగర్‌లో యున్న క్రీస్తుసంఘము గొప్ప సువార్త కూటములు నిర్వహించిరి. బస్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ప్రభు కాంప్లెక్స్ ప్రక్కన యున్న ఖాళీస్థలములో షామియానాలు కుర్చీలు వేసి ప్రాంగణమును కూటములు నిమిత్తము స్థానిక సంఘ యూత్‌వారు చక్కగా తీర్చిదిద్దిరి. ప్రతిరోజు మధ్యాహ్నం, సాయంత్రం కూటములు జరిగెను. ఆ కూటములకు స్థానిక ప్రజలు, సంఘస్థులు, పరిసరగ్రామాల వారు సంతోషముతో హాజరై దేవుని వాక్యమును వినిరి. సోదరులు రిక్కీగూటం, గుడే డేనియల్, యన్. ప్రసాద్, జాషువాగూటం, డి.జె. ప్రకాశ్, టి. ప్రసన్న కుమార్ గార్లు తదితరులు వాక్యపరిచర్యచేసిరి. రాజరాజబాబు నగర్‌లోను, రామచంద్రపురంలో వివిధ ప్రాంతములలోను, పరిసర గ్రామములలోను సోదరులు సి. హెచ్. దేసింగ్ గారు సతీసమేతముగా అనేక సంవత్సరముల నుండి సువార్త చాటుచున్నారు. ఈ సువార్త సభలలో సి. హెచ్. యెషయా గారు ప్రారంభ ప్రార్ధన చేయుటయే గాక పలువిధములుగా తమ సహాయ సహకారములందించిరి. సువార్త సభలకు హాజరైనవారికి, దూర ప్రాంతములవారికి స్థానిక సంఘము మంచి భోజన సదుపాయములను కల్పించిరి. ముఖ్యముగా యూత్ వారి కృషి అభినందనీయము.

మార్చి 3,4,5 తేదీలలో రిక్కీ గారు ఒరిస్సా వెళ్ళి అక్కడ సువార్త చాటిరి. గజపతి జిల్లా లుడిగుడలో మసేయగోమాంగో గారితో కలిసి పనిచేసిరి.

మార్చి 17వ తేదీ బుధవారం అల్లవరం మండలం దేవగుప్తంలో యున్న క్రీస్తుసంఘము తమ ఆలయముపై కాంక్రీటుస్లాబ్ వేసిన తరువాత, రిక్కీగూటం గారి చేతుల మీదుగా పున:ప్రతిష్ట చేసిరి. ఆ సందర్భముగా జరిగిన సువార్త కూటమునకు స్థానికులు, పరిసర గ్రామసంఘస్థులు వందలాదిగా హాజరై దేవుని స్తుతించిరి. అమెరికా నుండి వచ్చిన జెర్రీబేట్స్ గారు, ఆయన సతీమణి కూడా హాజరైరి. రిక్కీగారితో కలిసి జెర్రీబేట్స్ గారు వాక్యపరిచర్య చేసిరి. హాజరైన వారందరికీ భోజన సదుపాయము కల్పించబడెను. దేవగుప్తంలో సోదరులు యన్.ఏలియా గారు పలు సంవత్సరాలుగా రాత్రింబవళ్ళు కృషిచేసి దేవునికి మంచి ఫలితములు సాధించుచున్నారు. ఏలియ గారు ఆయన కుమారుడు జగజీవన్ రాజు గారు పరిసరగ్రామాలలోను సత్యసువార్త

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - ౩౦ | ఏప్రియల్ - ౨౦౧౦ | సంచిక -9


## రక్షణపొందుటకు నేనేమి చేయవలెను ?

( What must I do to be Saved ?)

రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను? అను ప్రశ్న అతి ప్రాముఖ్యమైనది. అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" ( హెబ్రీ 9:27). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును." (2 కొరింధి 5:10). పాపములో నుండి మనకు మనమే రక్షించుకొనలేము. "మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే రక్షింపబడి యున్నారు. ఇది మీవలన కలిగినది కాదు, దేవుని వరమే. అది క్రియల వలన కలిగినది కాదుగనుక ఎవడును అతిశయపడ వీలులేదు" (ఎఫెసీ 2: 8,9).

అయితే మనకు రక్షణ నిచ్చుటకు దేవుడు తన కృపను వెల్లడిపరచెను. తన భాగమును

పూర్తిచేసెను. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). మనలో ఎవడును నశింపవలెనని దేవుడు యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని కోరుచు ఆయన మన యెడల దీర్ఘశాంతము కలిగి యున్నాడు (2 పేతురు 3:9). అయితే దేవుడిచ్చు రక్షణ నందుకొనుటకు మానవుడు తన భాగమును పూర్తి చేవయులెను. మానవుడు చేయు క్రియలు స్వనీతి ననుసరించిగాక విశ్వాసమును బట్టి చేయవలెను. "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నాతండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు చెప్పెను (మత్తయి 7:21). "జీవవృక్షమునకు హక్కుగలవారై గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకు కొనువారు ధన్యులు" (ప్రకటన 22:14). అయితే "భేదములు పుట్టించి సత్యమునకు లోబడక దుర్నీతికి లోబ డువారి మీదికి దేవుని ఉగ్రతయు, రౌద్రమును వచ్చును" (రోమా 2:8).

రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను? అను ప్రశ్నకు సరియైన జవాబును కనుగొనుటకు అపొస్తులుల కార్యములు అను పుస్తకమును క్రొత్త నిబంధనలో చదువవలెను. ఈ ప్రశ్నకు వేర్వేరు సందర్భములలో యున్న ప్రజలకు వేర్వేరు రీతిగ జవాబీయబడెను. అపొ.కా. 2వ అధ్యాయములో యెరూషలేములోని ప్రజలు "సహోదరులారా! మేమేమి చేతుము?" అని అడిగిన ప్రశ్నకు "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి"యని జవాబీయ బడెను. అపొ.కా. 8వ అధ్యాయములో "ఇదిగో నీళ్ళు, నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమి?" యని నపుంసకుడు ఫిలిప్పు నడిగినపుడు, ఫిలిప్పు "నీవు పూర్ణ హృదయముతో విశ్వసించిన యెడల పొందవచ్చునని చెప్పెను. అతడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని విశ్వసించుచున్నానని యుత్తరమిచ్చెను" అపొ.కా. 16వ అధ్యాయములో చెరసాల అధిపతి "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అని అడుగగా "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును, నీయింటివారును రక్షణ పొందుదురని'' జవాబీయబడెను. అపొ.కా. 22వ అధ్యాయములో పౌలు "ప్రభువా, నేనేమి చేయవలెను?" అని అడిగినప్పుడు, నీవు లేచి ఆయన

నామమును బట్టి ప్రార్ధనచేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడుగుకొనుము" అని జవాబీయబడెను.

ఈ జవాబులన్నియు మనకు వేర్వేరుగ కనబడినను ఆ ప్రశ్నలను వేసినవారు ఏ పరిస్థితిలో యుండి అట్టి విధముగ ప్రశ్నించిరో మనము తెలిసికొనిన యెడల ఈ అంశము పై సత్యము మనకు వెల్లడియగును. ఈ సందర్భములో యున్న ప్రతివచనము దానికంటె తక్కువ భావమును గాక, మిగిలిన వచనములతో కలిపినప్పుడు ఎక్కువ భావమును వ్యక్తపర్చును. అపొ.కార్యములలో ఈ ప్రశ్నను వేసిన ప్రజలు క్రీస్తు యేసులోనికి మార్పు జెందుచున్న వివిధస్థాయిలో నుండి అడిగిరి. ఉదా: ఒక వ్యక్తి విశ్వసించి, ఒప్పుకొనిన యెడల, అతడు విశ్వసించవలెనని చెప్పుట అనవసరము. అందువలన అతడు మారుమనస్సు నొంది బాప్తిస్మము పొందవలెనని చెప్పబడెను.

రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను? అను ప్రశ్నకు జవాబును మనము జాగరూకతతో వెదకిన యెడల నేను యేసునందు విశ్వసించవలెను. పాపముల విషయమై మారుమనస్సు నొందవలెను, యేసును ఒప్పుకొనవలయును, బాప్తిస్మము పొందవలెను, అని గ్రహించగలము.

విశ్వాసము అతి ప్రాముఖ్యమైనది. విశ్వాసము లేకుండ దేవుని కిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6). నేను విశ్వసించక పోయిన యెడల నాకు శిక్ష తప్పదు అని క్రొత్తనిబంధన బోధించుచున్నది: " ఆయనయందు విశ్వాసముంచువానికి తీర్పు తీర్చబడదు: విశ్వసింపనివాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముం చలేదు. గనుక వానికి ఇంతకు మునుపే తీర్పుతీర్చబడెను" అని యోహాను 3:18 చెప్పుచున్నది. మనము విశ్వాసమూలమున నీతి మంతులముగా తీర్చబడుదుము (రోమా 5:1).

అయితే ఈ విశ్వాసము మన కెట్లు కలుగును? విశ్వాసము కొరకు ప్రార్థించుటవలన మనకు కలుగదు. ప్రభువును గూర్చిన దర్శనములను చూచుటవలన విశ్వాసము రాదు. అది లేఖనములలో వ్రాయబడి సాక్ష్యము మూలముగను (యోహాను 20:30,31), దేవుని వాక్యమును వినుట మూలముగను కలుగును (రోమా 10:17). ఈనాడు లేఖనములను చదువుటవలన లేక వినుటవలన గాక మరి వేరే విధముగ మనకు విశ్వాసము కలుగదు. అట్లు కలిగెనని మనము చెప్పుకొనుచున్న యెడల దేవుని పక్షపాతిగ చేయువారమగుదుము. "దేవుడు పక్షపాతి కాడని నిజముగా గ్రహించి యున్నానని" పేతురు అపొ.కా.

10:34లో పలికెను. అయితే ఈ విశ్వాసము మృతము అని దైవవేదము బోధించుచున్నది. (యాకో 2:17,20,22,24,26).

రక్షణ పొందుటకు నేనేమి చేయ వలెను? మారుమనస్సు పొందవలెను. ఇదికూడ ప్రాముఖ్యమే. బాప్తిస్మమిచ్చు యోహాను, యేసుక్రీస్తు, ఆయన అపొస్తులులు మారు మనస్సును గూర్చి బోధించిరి. మారుమనస్సు అనగానేమిటి? పశ్చాత్తాపము, ప్రార్ధన మారుమనస్సు కానేరదు. మారుమనస్సు అనగా మనస్సుతో పాటు జీవితాన్ని కూడ మార్చు కొనుట. పాపము యెడల మనస్సును మార్చుకొనుటకు దేవుని అనుగ్రహము మారుమనస్సు పొందుటకు మనలను ప్రేరేపించును (రోమా 2:4). దైవ చిత్తాను సారమైన దుఃఖము రక్షణార్ధమైన మారు మనస్సును కలుగజేయును" (2 కొరింధి 7:10).

రక్షణ పొందుటకు నేనేమి చేయ వలెను? యేసును ఒప్పు కొనవలెను. ఇదికూడ. ప్రాముఖ్యమే. మనము క్రీస్తును మనుష్యుల యెదుట ఒప్పుకొంటేనేగాని ఆయన మనలను గూర్చి తండ్రియొద్ద చెప్పడు (మత్తయి 10:32). ఒకని హృదయ పరిస్థితిని బట్టి నోరుకూడా పలుకును. మనము బహిరంగముగ దేవునియెడల అవిధేయత చూపుచూ వచ్చినప్పుడు బహిరంగ ముగానే ఆయన నామమును నొప్పుకొనుట చాలా ప్రాముఖ్యము. నేను దేనిని ఒప్పుకొన వలెను? నీ పాపములను బహిరం గముగ ఒప్పుకొనుమని లేఖనములు పాపికి ఎక్కడ బోధించుటలేదు. ప్రభువైన యేసునందున్న విశ్వాసమును నేను ఒప్పుకొనవలెను. యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు. ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యు డు హృదయములో విశ్వసించును. రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును" (రోమా 10:9-10). గనుక నేను ఒప్పుకొన వలసినది క్రీస్తునందలి నా విశ్వాసము నేగాని నా పాపములను కాదు. ఆ విశ్వాస మును నానోటితో మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను.

రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను? బాప్తిస్మము పొందవలె ను. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును" (మార్కు 16:16). "కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారుని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటినిగైకొనవలెనని వారికి

బోధించుడి" అని క్రీస్తే ఆజ్ఞాపించెను (మత్త 28:19,20). మనము ఆయనను ప్రేమించిన యెడల ఆయన ఆజ్ఞలను గైకొందుము (యోహా 14:15). ఆయన ఆజ్ఞలను గైకొనువారు జీవవృక్షమునకు హక్కుగలవారై యుందురు. రక్షణపొందు నిమిత్తము బాప్తిస్మము అవుసరమని ఆత్మావేశపు అపొస్తలులు బోధించిరి, అది మనలను రక్షించును అని అపొ.పేతురు 1 పేతురు 3:21లో వ్రాసెను. ఒకేఒక్క బాప్తిస్మమున్నదని పౌలు వ్రాసెను. (ఎఫెసీ 4:5). బైబిలు ప్రకారము అది నీటిలో ముంచడమే.

బాప్తిస్మమువలన పాపక్షమాపణ లభించును (అపొ.కా. 2:38), పాపములు కడిగివేయబడును (అపొ.కా. 22:16), పరిశుద్ధాత్మ అను వరము అనుగ్రహింపబడును. క్రీస్తును ధరించుకొని క్రీస్తులో యుందుము (గలతీ 3:27). అంతేకాకుండ క్రీస్తు సంఘములో క్రీస్తుతో చేర్చబడుదుము. రక్షింపబడిన నన్ను ప్రభువే చేర్చును. మరణ పర్యంతము నేను ఆయనకు నమ్మకముగా యున్న యెడల ఆయన నాకు నిత్యజీవ కిరీటము నిచ్చును. (ప్రక 2:10).

నీవు రక్షింపబడితివా? లేని యెడల యేసునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, ఆయన నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొని, క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుము. నీవట్లు చేసినయెడల ప్రభువు నిన్ను రక్షించి తన సంఘముతో తప్పక చేర్చును.

**గమనిక ::**

**సత్యవాణి T.V. కార్యక్రమములను ప్రతి బుధ, శుక్ర వారాల్లో సాయంత్రం 6:30 గంటలకు రక్షణ ఛానల్ లోను, శనివారం సాయంత్రము 7 గంటలకు UCC. ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను

# దేవునితో సంబంధము
## (Relationship with God)

తాను సృజించిన వాటిలో దేవుడు తన జ్ఞానాన్ని శక్తిని, మహిమను ఎట్లు బయలుపరచారో అలాగే తన హృదయాన్ని కూడ బైబిలు గ్రంధములో బయలు పరచారు.

దేవుడు కాలమున కతీతుడు, ఆయన నిన్న నేడు, నిరంతరము ఒకే రీతిగా యున్నారు. దేవుడు శక్తివంతుడు. ఆయనకు అసాధ్యమైనదేదీ లేదు. ఆయన పరిశుద్ధుడు, పవిత్రుడు ఆయన యందు కల్మషము యేమీ లేదు. దేవుడు ప్రేమయై యున్నాడని బైబిలు చెప్పుచున్నది (1 యోహాను 4:8).

దేవుడు మానవులను తన స్వరూపమందు సృజించారు. మనం ప్రేమించడానికి, ప్రేమించబడడానికి ఆయన మనకు శక్తినిచ్చారు, ఆయనతో సంబంధము కలిగియుండే అవకాశము కలిగించారు.

ఈ పత్రికలో ఇప్పటివరకు జ్ఞానియైన నిర్మాణికుని సూచించు రుజువులను పొందుపరచాము. దేవునియందలి మన విశ్వాసము విజ్ఞాన శాస్త్ర రుజువులపై ఆధారపడియుండలేదు. గాని ఆ రుజువులు దానిని బలపరచుచున్నాయి. దేవుని గూర్చిన సత్యాన్ని మనం గమనించాము. అయితే ఆ సత్యాన్ని మనం యేమి చేద్దాం?

నమ్మకమైన దేవుడు మనలను తన యొద్దకు పిలుచుచున్నారు. ఆయనను గూర్చిన సత్యాన్ని నమ్మడం మాత్రమే గాక ఆయనతో సంబంధము కలిగియుండాలని ఆయన పిలుచు చున్నారు.

**సత్యం క్రియారూపకం కావాలి:**

లీ స్ట్రోబెక్ అనునతడు డార్విన్ అనుచరులైన ఉపాధ్యాయులు దగ్గర విద్యనభ్యసించి నిర్దేవుడయ్యాడు. పెద్దవాడై అతడొక పత్రికల జర్నలిస్టు అయ్యాడు. అతడు సత్యమును అన్వేషించేవాడు, దొరికిన ఆధారాలను వెంటాడేవాడు. ఆయా వ్యక్తులను ఇంటర్వ్యూ చేసేవాడు.

అతని భార్య క్రైస్తవురాలై శ్రేష్టమైన వ్యక్తిగా, మంచి భార్యగా అందముగా, ప్రేమించే వ్యక్తిగా తయారయ్యింది. లీ దేవుని గూర్చిన సత్యాన్ని తెలిసికోవాలని నిశ్చయిం చుకొన్నాడు. అతడనేక గ్రంధాలు చదివాడు, డజన్లకొలదీ శాస్త్రజ్ఞులను ఇంటర్వ్యూ చేసాడు. ఈసత్యాన్వేషణలో డార్విన్ యొక్క పరిణామ సిద్ధాంతము

బలహీనమైన, అనిశ్చలమైన శాస్త్రీయ పునాదిపై ఆధారపడియున్నదని అతడు కనుగొన్నాడు. దేవుని సూచించే బలమైన రుజువులను కూడ అతడు కనుగొన్నాడు. ఇప్పుడైతే లీ స్ట్రోబెక్ మంచి విశ్వాస యోధుడుగా మారాడు.

అతని అన్వేషణానంతరము లీస్ట్రోబెక్ ఇట్లు వ్రాసాడు. "వైజ్ఞానిక శాస్త్రము, చారిత్రక వాస్తవాలు మనలను కొంతమట్టుకు నడిపిస్తాయి. గాని ఒక దశలో సత్యమును బట్టి మనం తప్పక స్పందించాలి." "ఒక నిర్మాణికుని గూర్చిన వాస్తవాన్ని గూర్చి ఆలోచించకుండా ఆయనను మన స్వంత నిర్మాణికునిగా అంగీకరించుటకు నిశ్చయించుకొనినప్పుడు ఆయనను మన నిజదేవునిగా చేసుకొనినప్పుడు ఆయనను వ్యక్తిగతముగా కలిసికొనగలము, అనుదిన సంబంధము కలిగియుండగలము, ఆయన వాగ్దానము చేసిన రీతిగా నిత్యత్వము ఆయనతో గడపగలము."

విజ్ఞానశాస్త్రము జ్ఞానము నభ్యసించుట మంచిదే గాని మనం అంతటితో ఆగిపోకూడదు. సైన్సు ద్వారా దేవుని కనుగొంటే సగం ప్రయాణం ముగిసినట్లే.

**ఆదాము హవ్వలతో దేవుని సంబంధము :**

ఏదెను వనంలో ఆదాము హవ్వలు ఒండొరులతో ఎంత సన్నిహిత సంబంధము కలిగియుండి రంటే వారిద్దరు ఏక శరీరమైనట్లు చెప్పబడింది. (ఆదికా 2:24). వారు ఏకాత్మ, ఏకాభిప్రాయము కలిగి ఒకే శరీరులైనట్లుండిరి. వారు దేవునితో కూడ సన్నిహిత సంబంధము కలిగి యుండిరి, దేవునితో కలిసివారు ఏదేనులో నడిచిరి, మాట్లాడిరి. దేవుడు వారిని ప్రేమించి వారి అవసరతలన్నీ తీర్చుటకు ఏర్పాట్లు చేసెను. గాని తరువాత దుష్టుడు ప్రేరేపించి సృష్టికర్తతో తమకున్న సంబంధమునుపాడు చేసాడు. (ఆదికా 3).

**అబ్రాహాముతో దేవుని సంబంధము :**

అబ్రాహాము ఎక్కడికి వెళ్లినా అతడు దేవుని ఆలాపిస్తు ఆయనతో ఒక మిత్రుడు మాట్లాడినట్లు మాట్లేదేవాడు. అబ్రహాము దేవుని మిత్రుడని పిలువబడేవాడు (యాకోబు 2:23).

**మోషేతో దేవుని సంబంధము :**

"మనుష్యుడు తన స్నేహితునితో మాటలాడునట్లు యెహోవా మోషేతో ముఖాముఖీగా మాటలాడుచుండెను" (నిర్గ 33:11).

మోషే నాయకత్వపు విజయ రహస్యము దేవునితో అతనికి గల భాగస్వామ్యమే. మోషే దేవుని సన్నిధిని, శక్తిని పొంది ఐగుప్తుకు వెళ్లెను (నిర్గ 3:12).

"అతడు నా యిల్లంతటిలోను నమ్మకమైనవాడు. నేను గూఢ భావములతో కాదు, దర్శనమిచ్చి ముఖాముఖిగా అతనితో

మాటలాడుదును" అని దేవుడు మోషేను గూర్చి చెప్పెను (సంఖ్యా 12:7-8). దేవుడే మోషే యొక్క బలము, ఆదరణ, జ్ఞానము యొక్క ఆధారము; దేవుడనితో యుండెను.

**దావీదుతో దేవుని సంబంధము :**

గొఱ్ఱెల కాపరియైన బాలునిగా దావీదు దేవునితో సన్నిహిత సంబంధము కలిగియుండెను. " యెహోవా నాకాపరి నాకు లేమి కలుగదు. పచ్చికగల చోట్ల ఆయన నన్ను పరుండజేయుచున్నాడు. శాంతికరమైన జలముల యొద్ద నన్ను నడిపించుచున్నాడు. నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతి మార్గములో నన్ను నడిపించుచున్నాడు. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను. నీవు నాకు తోడైయుందువు. నీ దుడ్డు కఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును" అని అతడు వ్రాసాడు (కీర్తన 23:1-4).

దావీదు తన జీవితములో కొన్ని తీవ్రమైన పొరబాట్లు చేసాడు. గాని అతడెల్లప్పుడు దేవుని యొద్దకు తిరిగివచ్చాడు. దేవునితో తనకున్న సంబంధాన్ని అతడు విలువైనదిగా ఎంచాడు. "నేను ఎల్లప్పుడు నీ యొద్ద నున్నాను. నా కుడిచెయ్యి నీవు పట్టుకొనియున్నావు" (కీర్త 73: 23) అని అతడు ప్రార్థించాడు. దావీదు దేవుని సన్నిధానములో జీవించాడు.

**నీవు కూడ దేవునితో సంబంధము కలిగి యుండవచ్చును :**

యిది ఆశ్చర్యమైన ఆలోచనయే, గాని నీవు కూడా దేవునితో, నీ సృష్టికర్తతో వ్యక్తిగత సంబంధము కలిగియుండవచ్చును. సూర్య చంద్ర నక్షత్రములను, భూమిని సమస్తాన్ని సృజించిన దేవుని సన్నిధానములో నీవును నడువవచ్చును. ఈ విశ్వం చలించు నిమిత్తము దానికి చట్టము లిచ్చిన దేవునితో నీవు సత్సంబంధము కలిగియుండవచ్చును. ఆయన ఫిజిక్స్ దేవుడు, కెమిస్ట్రీ దేవుడు, బయోలజీ, మైక్రోబయాలజీ మరియు బోటనీల దేవుడు. నిన్ను సృజించిన దేవుని సముఖములో నీవు జీవించ వచ్చును.

**దేవుడు నిన్ను వెదుకుచున్నాడు :**

నీతో సంబంధము కావాలనే కోరిక చొప్పున దేవుడు యేసుక్రీస్తు ద్వారా తన్నుతాను ప్రత్యక్షపరచు కొన్నారు. " ఆయన శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను. తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనమాయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:14).

**దేవుడు నీ తండ్రి కావచ్చును :**

మనం ప్రార్థించునప్పుడు "పరలోకమందున్న మా తండ్రీ" అని

ఆయనను సంభోధించాలని యేసు బోధించారు (మత్తయి 6:9). దేవుడు నీ పరలోకపు తండ్రియై యున్నారు. యేసు దానిని సాధ్యపరచారు. "తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి అనగా ఆయన నామమందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అను గ్రహించెను". వారు దేవుని వలన పుట్టినవారు కారు'' (యోహాను 1:12-13).

క్రొత్త జన్మ :

శుభవార్త! నీవు దేవుని కుటుంబములో జన్మించవచ్చును ! యేసు ఇట్లు చెప్పారు : " ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడు...... ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలము గాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడని'' యేసుప్రభువు చెప్పారు (యోహాను 3:3-5).

నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించుట ద్వారా మనం దేవుని కుటుంబములో ప్రవేశించుదుము. ఇక్కడ నీరు బాప్తిస్మము, ఆత్మ పరిశుద్ధాత్మ. మనం బాప్తిస్మము పొందిన తరువాత పరిశు ద్ధాత్ముడు మనలో నివసించును. యేసుక్రీస్తు సిలువ వేయబడిన 50 దినముల తరువాత పేతురు యెరూషలేములో గుమిగూడిన జనసమూహమునకు సువార్త ప్రకటించెను. వారు యేసును చంపించారని, దేవుడాయనను మృతులలో నుండి లేపారని వారు గ్రహించిన తరువాత "సహోదరులారా, మేమేమి చేతుమని వారు అడిగారు (అపో.కా. 2:37).

"పేతురు – మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారికి చెప్పాడు (అపో.కా. 2:38). మరియు " ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులకందరికిని చెందునని అతడు వారికి చెప్పెను" (2:39).

ఆయనతో సంబంధము కలిగి యుండుటకు దేవుడు మనలను పిలుచుచున్నారు. మనం మారుమనస్సు పొందినప్పుడు క్రీస్తు నామమున నీటిలో ముంచడము పొందినప్పుడు దేవుడు మన పాపములను క్షమించి మనకు పరిశు ద్ధాత్మనుగ్రహించును. దేవుడు తన ప్రేమను పరిశుద్ధాత్మ ద్వారామన హృదయములలో కుమ్మరించును (రోమా 5:5).

మనము దేవుని సన్నిధానములో జీవించుచుండగా దినదినము ఆయన వలె

మార్పునొందుదుము. "మనమందరమును ప్రభువు యొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింపజేయుచు మహిమ నుండి అధిక మహిమను పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుదుము" (2 కొరింథీ 3:18).

**మనకు లభించు సహాయము :**

మన స్వశక్తిచే దుష్టత్వమును జయించలేము, గనుక దేవుడు మనకు సహాయను నిచ్చుచున్నారు. " మీరు శరీరానుసారముగా ప్రవర్తించిన యెడల చావవలసిన వారైయుందురు గాని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యున్నారు" (రోమా 8:13-14).

ఇది ఆశ్చర్యంగాని, నిజం!! సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞాని, సర్వాంత వ్యామియు నిత్యుడైన దేవునితో సంబంధము కలిగి యుండవచ్చును. విజ్ఞాన శాస్త్రముల యొక్క అన్ని బ్రాంచీల దేవుడు నిన్ను తన కుటుంబములోనికి ఆహ్వానించుచు న్నారు.

**దేవుని కుటుంబము :**

దేవుని కుటుంబము అనగా యేమిటి? మనం దేవుని బిడ్డలముగా ఎట్లుకాగలము? క్రొత్త నిబంధన ప్రకారము మనము క్రీస్తును ధరించుకొంటే దేవుని కుటుంబములో ప్రవేశించగలము. అనగా యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, పాపముల విషయము మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము నీటిలో క్రీస్తునామమున ముంచబడినప్పుడు క్రీస్తును ధరించుకొందుము. దేవుని కుటుంబములో ప్రవేశింతుము (రోమా 6:3-4; అపో.కా. 2:38; 22:16; గలతీ 3:27).

నేడు అసంఖ్యాక సంఘము లున్నాయి. అవన్నీ వివిధ సిద్ధాంతము లను బోధించుచు, వివిధ నామములు ధరించుకొనియున్నాయి. విశ్వాసము వలన మాత్రమే రక్షింపబడుదుమని కొందరు బోధిస్తారు. దేవుడు, క్రీస్తు నీ పాపములు క్షమించాడని నమ్మితే చాలునని కొందరు బోధిస్తారు. రక్షింపబడాలంటే బాప్తిస్మము పొందాలని మరికొందరు బోధిస్తారు.

ఇదంతా గందరగోళమే, వివిధ సంఘాలు వివిధరీతులుగా ఆరాధి స్తారు. కొందరు ఆదివారమున, మరికొందరు శనివారమున ఆరాధి స్తారు. కొందరు వాద్యాలు వినియో గిస్తారు. డేన్సులు వేస్తారు. పాడతారు. కొందరు ప్రభురాత్రి భోజనం నెలకొకసారి, మూడు నెలలకొకసారి, మరికొందరు ప్రతి ఆదివారమున ఆచరిస్తారు. కొందరు స్వస్థతవరం గలవారమని, రోగులను బాగుచేయు దుమని చెబుతారు. వీరందరిలో నిజమైన దేవుని కుటుంబము ఎవరో మనకు ఎట్లు తెలియును? ఈ సంఘాల్లో యేది సత్యమును బోధించు

చున్నదో మనకెట్లు తెలియును? ఆయాబోధలను దేవుని వాక్యముతో పోల్చి చూస్తేనే మనకు తెలియును.

**ఒకే ఒక సంఘము :**

యేసు మాటలనుబట్టి ఒకే ఒక్క సంఘమున్నది. "నా సంఘమును నేను కట్టుదును" అని యేసు చెప్పారు (మత్త 16:18). సంఘములను అని ఆయన చెప్పలేదు. "పాతాళ లోక ద్వారములు దాని యెదుట నిలవనేరవని" ఆయన చెప్పారు. అంటే, ఆయన సంఘము ఎన్నడు నాశనముకాదు.

క్రీస్తు సంఘము పెంతెకొస్తు దినమున స్థాపించబడెను (అపొ.కా.2). అది అనేక దేశాలలో స్థానిక సంఘ ముల వలెయున్నది. శతాబ్దముల తరబడి ఎందరు క్రీస్తు సువార్తకు లోబడితిరో అట్టి వారు దేవుని కుటుంబ ములో ప్రవేశించారు. వారే క్రీస్తు సంఘము. అది నేడున్నది,. నీవు దానిలో యుండ వచ్చును. అది దేవుని కుటుంబము. యేసు తన సంఘము వందలాది శాఖలవలె చీలిపోవాలని కాంక్షించలేదు. ఆయన సిలువ వేయబడిన రాత్రి ఇట్లు దేవునికి ప్రార్థించెను: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ, నాయందు నీవును నీ యందు నేనును ఉన్నలాగున వారును మన యందు ఏకమై యుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను17: 20-21).

ఎఫెసులోని సంఘమునకు వ్రాస్తు పౌలు ఇట్లు చెప్పాడు : " శరీర మొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుం డుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మము ఒక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించియున్నాడు" (ఎఫెసి 4:4-6). ఇక్కడ చెప్పబడిన ఒక్కటే శరీరము సంఘమైయున్నది (ఎఫెసీ 1:22-23).

మతశాఖల సంఘాల బోధలలోను ఆచరణలలోను యున్న వ్యత్యాసములను బట్టి ప్రజలు గజిబిజియై క్రీస్తుకు దూరమైపోవుచున్నారు. గాని నీవు మాత్రము ఒక క్రైస్తవునిగా యుండగలవు. ఏమత శాఖకు చెందని క్రీస్తు సంఘ సభ్యునిగాను, దేవుని కుటుంబములో ఒక బిడ్డగాను యుండగలవు.

**దేవుని కుటుంబములో భద్రత :**

దేవుని కుటుంబములో యుంటే "మరణమైనను జీవమైనను దేవదూత లైనను ప్రధానులైనను ఉన్నవియైనను రాబోవునవియైనను అధికారులైనను ఎత్తయినను లోతైననూ సృష్టింపబడిన మరిఏదైనను మన ప్రభువైన క్రీస్తు యేసునందలి దేవుని ప్రేమనుండి మనలను

ఎడబాపవు" (రోమా 8:38-39). అనుదినం, అనుక్షణం నీవు దేవుని సన్నిధానములో జీవించవచ్చును.

నిశీధరాత్రివేళ నింగిలో యున్న అందము, ఆశ్చర్యాన్ని గొలిపించు సూర్యాస్తమయం ఇవన్నీ మన హృదయ వాంఛల నెరవేర్పుకు సూచికలు. అయితే అవి సూచించువాటిని మరచిన యెడల మన గమ్యము లోప భూయిష్టమైనదగును. మన తృష్ణ అర్థ రహితమగునని అలిస్టర్ మెగ్రాత్ అనునతడు చెప్పాడు.

మనం చూచిన విజ్ఞానశాస్త్ర రుజువులన్నీ దేవుని యొద్దకు నడిపించు సూచికలు మాత్రమే. దేవుడు మనలను తనయొద్దకు పిలుచుచున్నారు. మనం ఆయన ఆహ్వానాన్ని అంగీకరించునట్లు తన చేతులు చాచియున్నారు (యెషయా 65:2; మత్త 11:28).

"ఆయన యందు మనము బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము" (అపో.కా. 17:28). ఆయనలో మన నిగూఢమైన కోరికలు నెరవేరును. ఆయనలో మన తృష్ణయొక్క భావాన్ని సంతుష్టి చేసు కోగలం.

– రిచర్డ్ ఏడీ

# పరమందొక దేవుడున్నాడు

(There is a God in heaven)

రాజైన నెబుకద్నెజరు ఏలుబడి 2వ సం॥ మందు ఆయన ఒక కలగన్నాడు. దానినతడు మరచిపోయాడు. అందు వల్ల అతని మనసు కలతపడి నిద్రలేకుండా పోయింది. గనుక తాను కనిన కలను దాని భావమును తెలియచెప్పుటకై రాజు తన ఆస్థానంలోని శకునగాండ్రను, గారడీ విద్యగలవారిని, మాంత్రికులను ఆజ్ఞాపించాడు గాని వారు దానిని తెలియచెప్పలేక పోయారు. ఆగ్రహించిన రాజు బబులోనునందలి జ్ఞానులనందరిని సంహరింపవలెనని ఆజ్ఞాపించాడు. "ఇట్టిశాసనము బయలుదేరుట వలన జ్ఞానులు చంపబడవలసి యుండగా, వారు దానియేలును అతని స్నేహితులను చంపజూచిరి (దాని యేలు 2:13). అప్పుడు దానియేలు రాజు వద్దకు వెళ్లి స్వప్నభావము తెలియ చేయడానికి తనకు కొంత సమయ మిమ్మని అడిగాడు.

దానియేలు, అతని స్నేహితులు, బబులోను నందలి జ్ఞానులందరి ప్రాణములు ప్రమాదములో నుండెను. వారిని చంపునట్లు రాజు ఆజ్ఞజారీ

ఆయెను. దానియేలు దేవుని కృపను వెతుకుతున్నాడు. “అప్పుడు దానియేలు తన ఇంటికి పోయి తన స్నేహితులైన హనన్యాకును, మిషాయేలుకును అజర్యాకును సంగతి తెలియజేసి తానును తన స్నేహితులును బబులోనులో తక్కిన జ్ఞానులతో కుడా నశింపకుండునట్లు........ దేవుని వలన కటాక్షము పొందునిమిత్తమై ఆయనను వేడుకొనుడని వారిని హెచ్చరించెను'' (దాని2:17,18) అపుడు ఆమర్మము రాత్రియందు దర్శనములో దానియేలుకు బయలు పరచబడెను. గనుక దానియేలు పరలోక మందున్న దేవుని స్తుతించాడు.

సర్వోన్నతుడు, సర్వశక్తి మంతు డునైన దేవుడు ఇలా అంటున్నాడు: “ఆపత్కాలమున నీవు నన్ను గూర్చి మొఱ్ఱపెట్టుము నేను నిన్నువిడిపించెదను నీవు నన్ను మహిమపరచెదవు” (కీర్తన 50:15). ప్రభువైన దేవుడు ఎర్రసము ద్రమును పాయలుగా చేసి ఇశ్రాయేలు ప్రజలను ఫరో బంధకముల నుండి విడిపించారు. అప్పుడు మోషేయు ఇశ్రాయేలీయులును “యెహోవాను గూర్చి గానము చేసెదను, ఆయన మిగుల అతిశయించి జయించెను.......... యెహోవా నిరంతరము ఏలువాడు'' (నిర్గ 15:1-18) అని ప్రభువుకు స్తుతులు పాడారు. దేవుడు హన్నా ప్రార్థన ఆలకించి ఆమెకు సమూయేలును ఇచ్చారు. అపుడు ఆమె ప్రభువును ఇలా స్తుతించింది “నాహృదయము యెహోవా యందు సంతోషించుచున్నది........... తాను అభిషేకించిన వానికి అధిక బలము కలుగజేయును'' (1సమూయేలు 2:1-10). ప్రవక్తయైన యోనా మత్స్యము కడుపులోనుండి స్తుతించాడు. “నేను ఉపద్రవములో ఉండి యెహోవాకు మనవి చేయగా ఆయన నాకు ప్రత్యుత్తర మిచ్చెను ...... యెహోవా యొద్దనే రక్షణ దొరకును” (యోనా 2:1-9).

దేవుడు ఎస్తేరు యొక్కయు ఆమె పనికత్తెల యొక్కయు ప్రార్థన ఆలకించి యూదా జనాంగమును హామాను యొక్క దుష్టపథకము నుండి కాపాడెను. “ఏలయనగా మనము ఆయనకు మొఱ్ఱపెట్టునప్పుడెల్ల మనదేవుడైన యెహోవా మనకు సమీపముగా నున్నట్లు మరి ఏ గొప్పజనమునకు ఏదేవుడు సమీపముగానున్నాడు?'' (ద్వితి4:7). “దేవుడు నా ప్రార్థనను త్రోసివేయలేదు నాయొద్ద నుండి తన కృపను తొలగింపలేదు, ఆయన సన్నుతింపబడును గాక” (కీర్తన 66:20). “ఆయన యాజకులలో సమూయేలు ఉండెను, వారు యెహోవాకు మొర్రపెట్టగా ఆయన వారికుత్తర మిచ్చెను” (కీర్తన 99:6). మన పరలోకపు తండ్రి

మనప్రార్ధన లనాలకించును (మత్తయి 7:7-11; లూకా 18:4). గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను, నీవు నాకు తోడైయుందువు నీదుడ్డు కఱ్ఱయు నీ దండమును నన్ను ఆదరించును". అనేక పర్యాయములు దేవుడు దావీదును ఆతని శత్రువులనుండి విడిపించారు, అయన చేసిన ఉపకారము లన్నిటికి అతడు ఎల్లవుడు దేవునికి వందనాలు చెల్లించేవాడు.

దానియేలు రాజుయొక్క కలను, దాని భావమును దేవుని యొద్దనుండి పొంది శక్తిగల ఆ దేవుని నామమును స్తుతించి వందనాలర్పించాడు. మన దేవుడు జ్ఞానవంతుడు, బలవంతుడు. ఆయన జ్ఞానము వలన బలము వలన సర్వలోకమును ఏలుచున్నారు. కాలములను సమయములను తన స్వాధీనములో ఉంచుకొనినవాడు అయన ఒక్కరే. ఆయన శక్తిచేతనే రాజ్యములు కూలును రాజులు లేతురు. "తూర్పు నుండి యైనను పడమటి నుండియైనను అరణ్యము నుండి యైనను హెచ్చుకలుగదు......... ఆయన ఒకని తగ్గించును ఒకని హెచ్చించును" (కీర్తన 75:6,7). "జనములను విస్తరింపజేయును నిర్మూలము చేయును సరిహద్దులను విశాలపరచును జనములను కొనిపోవును" (యోబు 12:23). మన దేవుడు సర్వాధికారి. మరణాంధకారములో ఏముందో ఆయన ఎరుగును "చీకటిలోని రహస్యములను ఆయన బయలుపరచుచు మరణాంధ కారమును వెలుగులోనికి రప్పించును" (యోబు 12:22). సర్వజ్ఞుండైన మన దేవుడు అన్ని ఎరుగును. సముద్రాగాధములలో ఏముందో, గాఢాంధ కారంలో ఏముందో ఆయన ఎరుగును. "నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును....... నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను .......... నాకు కలుగ వెలుగు రాత్రివలె ఉండును .......... చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి. (కీర్తన 139:7-12). మన దేవుడు సర్వంతర్యామి, ఆయన ప్రతిదానిలోను ఉన్నారు.

సర్వజ్ఞుండు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడునైన మనదేవుడు సమీపింపరాని తేజస్సులో వసించును. (1 తిమోతి 6:16). వెలుగును వస్త్రముగా ధరించుకొనిన వాడు (కీర్తన 104 :2). ఆయన బిడ్డలకొరకు లక్ష్యము చేయును, ఆయన చెవులు వారి ప్రార్ధనల వైపు తెరచి ఉన్నవి (1 పేతురు 3:12). పరలోకమందున్న మన దేవుడు కాలమును ఆయన స్వాధీనములో ఉంచుకొని యున్నారు.

మనందరి భవిష్యత్ ఆయన ఎరిగి యున్నారు.

దానియేలు రాజైన నెబుకద్నెజరుతో "రాజా, ప్రస్తుతకాలము గడచిన పిమ్మట ఏమి జరుగునో అనుకొని తాము పడక మీద పరుండి మనోచింత గలవారై యుండగా మర్మములను బయలు పరచువాడు కలుగబోవు దానిని తమరికి తెలియజేసెను" (దానియేలు 2:29). రాజునకు కలిగిన స్వప్నమును గూర్చి దాని భావమును గూర్చి మనము దానియేలు గ్రంథం 2:29-45 లో చూడగలము. తన అనంతరము వచ్చు రాజ్యములకు సంభవింపబోవు వాటిని, నాల్గవ రాజ్య కాలంలో స్థాపింపబడు సంఘమును గూర్చియు దేవుడు ఆతనికి తెలియచేసియున్నాడు.

సాధారణంగా ప్రజలు సాష్టాంగ నమస్కారముచేసి రాజును ఆరాధిస్తారు గాని ఇక్కడ రాజగు నెబుకద్నెజరు దానియేలునకు సాష్టాంగ నమస్కారముచేసి ఆతని పూజించి, నైవేద్య ధూపములు ఆతనికి సమర్పింప ఆజ్ఞాపించెను. "మరియు రాజు, ఈ మర్మమును బయలు పరచుటకు నీవు సమర్థుడవైతివే, నీవేవుడు దేవతలకు దేవుడును రాజులకు ప్రభువును మర్మములను బయలు పరచువాడునై యున్నాడు. తరువాత రాజు దానియేలును అధిపతినిగాను బబులోను జ్ఞాను లందరిలో ప్రధానునిగాను నియమిం చెను". (దాని 2:46-48). రాజు చేత చంపబడవలసి యుండగా దానియేలు ప్రార్థించి దేవుని సహాయాన్ని కోరి గొప్ప వాడాయెను. దానియేలు రాజు సన్నిధిలో కూర్చున్నాడు (దానియేలు 2:49). పరలోక మందున్న దేవుడు నీకోసం ఆలోచిస్తున్నాడు. కృతజ్ఞత కలిగిఉండు.

- కబిత గూటం.

## దేవుని రాజ్యము
## (The Kingdom of God)

క్రీస్తు రాక 600 సంవత్సరముల పూర్వము దేవుడు భూమిపై రాజ్యమును స్థాపించబోవు దినమును గూర్చి దానియేలు ప్రవచించాడు (దాని 2:44). క్రీస్తు యొక్క మార్గము, క్రీస్తు సంఘమే ఆ రాజ్యము (మత్త 16:18). సంఘమే నిశ్చలమైన ఆరాజ్యము (హెబ్రీ 12:28).

ఆ రాజ్యము పరలోక రాజ్యమని యు (మత్త 3:2), దేవుని రాజ్యమనియు

(మత్త 12:28) తదువరి క్రీస్తు రాజ్యమనియు వివిధములుగా చెప్పబడి యున్నది (కొలస్స 1:13).

క్రీస్తు రాజ్యము భౌతికముగాక ఆత్మీయ రాజ్యమని తెలిసికోవాలి. "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు, నా రాజ్యము ఈ లోక సంబంధమైన దైతే నేను యూదులకు అప్పగింపబడ కుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహసంబంధమైనది కాదని" యేసు పిలాతుతో చెప్పెను (యోహాను 18:36). క్రీస్తు రాజ్యము ఏదేని ఒక భూభాగమును స్వాధీనము చేసికొనిలేదు. దాని శిష్యుల హృదయ ములే దాని భూభాగము. అందుకే "దేవుని రాజ్యము మీ మధ్య నేయున్నదని" యేసు చెప్పెను (మత్త 17:20-21). గనుక అది పరలోక రాజ్యమనబడినది. అది పరలోకములోనే ఆరంభమాయెను. పరలోకమేదాని గమ్యము. జనులను పరలోక పౌరస్థితి కొరకు సిద్ధపరచుటయే దాని ధ్యేయము (ఫిలిప్పీ 3:20).

దేవుని రాజ్యము దైవిక చక్రవర్తిచే పాలింపబడును. యేసుకుదేవుడు ఇహపరముల యందు సర్వాధికారమిచ్చి యున్నారు (మత్త 28:18). అందువలన అది దేవుని ప్రియకుమారుని యొక్క రాజ్యము (కొలస్స 1:12-13). ఆయన రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నారు (తిమో 6:14-16). ఆయన రాజ్యమైన సంఘమును పాలించుటకు ఏ మనుష్యునికి గాని, మనుష్యుల గుంపుకుగాని అధికారము లేదు. ఏలయనగా క్రీస్తు ఒక్కడు మాత్రమే ఆయన సంఘమునకు లేదా రాజ్యమునకు శిరసైయున్నారు (ఎఫెసీ 1:22).

క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్యపౌరులు ఆయన రక్తము వలన రక్షింపబడి సంఘముతో చేర్చబడిన వారు. పరలోకమందున్న తండ్రి ఒకని అంధకార సంబంధ రాజ్యము నుండి విడుదల చేసినప్పుడు వానిని తన ప్రియ కుమారుని రాజ్యమందు చేర్చును (కొలస్స 1:13; అపొ.కా. 2:47). ఆయన మనలను దేవునికి ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసెనని యోహాను క్రైస్తవులకు తెలియజేయుచున్నాడు. (ప్రక 1:6). ప్రతి క్రైస్తవుడు దేవుని యాజకుడే. అందు వలన అతడు రాజ్య సభ్యుడు (1 పేతురు 2:5,9). ఇంకా రక్షింపబడకుండా యున్నవారు అంధకార సంబంధ రాజ్యములో యున్న వారు, దేవుని రాజ్యములో లేనివారు. దేవుని రాజ్య పౌరుడు కావాలంటే ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించాలి (యోహాను 3:3-5). పాపియైన వాడు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి

బాప్తిస్మము పొందినప్పుడు ఈ క్రొత్త జన్మ సంభవించును (అపో.కా. 2:38).

క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్యము నీతి సూత్రములతో పాలించబడును. "యెహోవా న్యాయవిధుల సత్యమైనవి, అవి కేవలము న్యాయమైనవి " (కీర్తన 19:9) " ఆత్మయొక్క నియమము పాప మరణముల నియమము నుండి విడిపించును" (రోమా 8:2). క్రీస్తు యొక్క నియమము (గలతీ 6:2), శ్రేష్టమైన నూతన నియమము (హెబ్రీ 8:6-13). అది స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణనియమము (యాకోబు 1:25).దేవుని రాజ్యపౌర సత్వము విలువైన అనేక దీవెనలనిచ్చును. ఆయన రాజ్యములో మనకు విమోచనము అనగా మనకు పాపక్షమాపణ కలుగుచున్నది (కొలస్స 1:13). పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మనకు కలుగుచున్నది (ఎఫెసీ 1:3). రాజ్య పౌరులుగా క్రీస్తు మనయందు నివసిస్తు, మహిమ నిరీక్షణయై యున్నారు (కొలస్స 1:27).

పరలోక రాజ్యము యొక్క గమ్యము ప్రకాశమానమైనది, మహిమ గలది. మృతులను లేపుటకు యేసు మరల వచ్చునప్పుడు ఆయన తన రాజ్యమును తండ్రి కప్పగించును (1కొరింధీ 15:24). "వ్యభిచారియైనను అపవిత్రుడైనను విగ్రహారాధకుడై యున్నలోభియైనను క్రీస్తు యొక్కయు దేవుని యొక్కయు రాజ్యమునకు హక్కు దారుడు కాడు" (ఎఫెసీ 5:5, 1 కొరింథీ 6:9-11). పరలోకములో ఈ రాజ్యపౌరులు నూతన శరీరములు గలవారై వ్యాధిబాధలు, వృద్ధాప్యము లేని వారై యుందురు (1 కొరింథీ 15:50-52). అనుభవించుటకు నిత్యజీవము వారిదగును (2 పేతురు 1:11). వారు తమ సృష్టికర్తయు విమోచకుడైన వాని ముఖదర్శనము చేయుచు యుందురు గనుక అది వర్ణింప శక్యముగాని నిత్యజీవము (ప్రకట 22:1-5).

నీవు నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించావా ? నీవు నమ్మకమైన పౌరునివలె రాజ్యము కొరకు జీవిస్తు రాజును సేవించుచున్నావా ? నమ్మకముగా యున్నవారే నిత్యజీవ కిరీటాన్ని అందు కొంటారు ! (ప్రక 2:10).

- జాన్‌వాడ

# నెబుకద్నేజరు కల

రాజైన రెండవ నెబుకద్నేజరు తన తండ్రితో పాటు క్రీ.పూ. 607 నుండి క్రీ.పూ. 605 వరకు బబులోను సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. తండ్రి మరణానంతరం క్రీ.పూ॥ 605 నుండి క్రీ.పూ 562 వరకు స్వతంత్రంగా రాజ్యమేలాడు. క్రీ.పూ 597 లోను క్రీ.పూ 586 లోను యెరూషలేము పై దండెత్తి యెరూషలేము పట్టణాన్ని దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. అందుండిన అందచందములు గలవారిని జ్ఞానవంతులైన వారిని బబులోనుకు చెరగా కొనిపోయాడు. అట్లు చెరగొని పోబడిన వారిలో దానియేలు ఒకడు. కొంత శిక్షణనిచ్చాక దానియేలును రాజైన నెబుకద్నేజరు అతని ఆస్థానములో జ్ఞానిగా నియమించాడు.

క్రీ.పూ 603 లో నెబుకద్నేజరు ఒక విచిత్ర కలగన్నాడు. ఆ వివరం దానియేలు గ్రంథము 2వ అధ్యాయంలో పొందు పరచబడింది. నెబుకద్నేజరు తన కల ఏమిటో ఎవరితో చెప్పకుండా రాజ్యములోని జ్ఞానులందరిని పిలిపించి తాను కన్న కల ఏమిటో దాని భావమేమిటో చెప్పమని ఆజ్ఞాపించాడు. అది చెప్పలేక పోయిన జ్ఞానుల్ని సంహరింప మొదలు పెట్టాడు. అప్పుడు దానియేలును అతని ముగ్గురు స్నేహితులును దేవుడైన యోహెూవాకు మొరపెట్టగా దేవుడు వారి ప్రార్థన విని ఆ కలను దాని భావాన్ని దానియేలుకు ప్రత్యక్షపరిచారు.

కల :

"రాజా, తాము చూచు చుండగా బ్రహ్మాండమగు ఒక ప్రతిమ కనబడెను గదా, ఈ గొప్ప ప్రతిమ మహా ప్రకాశమును, భయంకరమునైన రూపమును గలదై తమరి యెదుట నిలిచెను. ఆ ప్రతిమ యొక్క శిరస్సు మేలిమి బంగారుమయమైనదియు, దాని రొమ్మును, భుజములును వెండివియు, దాని ఉదరమును తొడలును ఇత్తడివియు, ఒక భాగము మట్టిదియునై యుండెను. మరి చేతి సహాయము లేక తీయబడిన ఒకరాయి, ఇనుమును మట్టియు కలిసిన ఆ ప్రతిమ యొక్క పాదములు మీదపడి దాని పాదములను తుత్తునీయలుగా విరుగ గొట్టినట్టు తమకు కనబడెను. అంతట ఇనుమును మట్టియు ఇత్తడియు, వెండియు, బంగారమును ఏకముగా దంచబడి కళ్ళెములోని చెత్తవలె కాగా వాటికి స్థలము ఎచ్చటను దొరకకుండ గాలి వాటిని కొట్టుకొని పోయెను ; ప్రతిమను విరుగగొట్టిన ఆరాయి సర్వభూతములమంత మహా పర్వతమాయెను" (దాని 2:31-35).

**భావము :**

ఆ ప్రతిమ మానవ స్థాపితమైన నాలుగు రాజ్యములకు సాదృశ్యము. "ఆరాజుల కాలములో (నాలుగవ రాజ్య ఏలుబడిలో) పరలోక మందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందిన వారికి కాక మరెవరికిని చెందదు; అది ముందు చెప్పిన రాజ్యము లన్నింటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగ యుగముల వరకు నిలుచును" (దాని 2:44).

**దాని నెరవేర్పు :**

మొదటిది నెబుకద్నేజరు రాజ్యము. నెబుకద్నేజరు బంగారు శిరస్సు (దాని 2:38). రెండవది మాదీయుల పారసీకుల రాజ్యము (దాని 5:28; 6:8). రెండు వందల సంవత్సరాలకు ముందే దానియేలు మూడవ రాజ్యాన్ని గూర్చి ప్రవచించాడు. మూడవది గ్రీకు రాజ్యము (దాని 8:21). నాలుగవ రాజ్యాన్ని గూర్చి చరిత్ర మనకు చాటి చెప్తోంది. అది రోమా సామ్రాజ్యము. ఆ నాలుగవ రాజ్యమైన రోమా సామ్రాజ్యపు కాలమందే యేసును మరి ఇతరులును దేవుని రాజ్యమును గూర్చి "ప్రబోధించారు. పరలోక రాజ్యము సమీపించి యున్నది" (మత్తయి 3:2; 4:17; 10:7). మరియు "ఆయన – ఇక్కడ నిలిచి యున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచు వరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచు న్నాననెను" (మార్కు 9:1).

అపొస్తలుల కార్యగ్రంథము 2వ అధ్యాయములో సూచించబడినట్లుగా ఆరాజ్యము క్రీస్తు పునరుత్థానుడైన తరువాత మొదటి పెంతెకోస్తునాడు మహాశక్తితో ప్రారంభమైంది. ఆనాడు దాదాపు 3000 మంది క్రీస్తు సువార్తకు లోబడ్డారు. ఆ రాజ్యము క్రీ.శ 33వ సంవత్సరంలో ప్రారంభమైంది. ఆ తరువాత దైవచిత్తాన్ని బయలుపర్చుచూ పౌలు క్రైస్తవుల నుద్దేంచి ఈ లాగు సెలవిచ్చాడు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులనుగా చేసెను" (కొలస్స 1:13). అనగా దేవుని రాజ్యము వచ్చినట్లు వారందరు అందులో పాలివారైనట్లు ఈ వాక్యము మనకు తెల్పుచున్నది. ఇదే దానియేలు 600 సంవత్సరాల ముందే ప్రవచించిన యుగయుగములు నిలుచు దేవుని రాజ్యము. ఇప్పుడు యేసు రాజుగా ఆ రాజ్యమును అనగా సంఘమును ఏలుచున్నారు. (1 కొరింథీ 15:24,25; కొలస్స 1:18; మత్తయి 16:18,19; అపొ కార్యములు 2:30,33,36). యేసుక్రీస్తు

ఈనాడు రాజులకు రాజుగాను ప్రభువులకు ప్రభువునై యున్నారు (ప్రకటన 17:14).

| కల | భావము | నెరవేర్పు |
|---|---|---|
| శిరస్సు - బంగారం | మొదటి రాజ్యము (దానియేలు 2:38) | బబులోను రాజ్యం క్రీ.పూ. 625 -539 |
| రొమ్మును భుజములు వెండి | రెండవ రాజ్యము (దానియేలు 2:39) | మాదీయ, పారసీక రాజ్యం క్రీ.పూ. 539 -331 |
| ఉదరము- తొడలు ఇత్తడి | మూడవ రాజ్యము (దానియేలు 2:39) | గ్రీకు రాజ్యము క్రీ.పూ. 331 -168 |
| కాళ్ళు, పాదములు ఇత్తడి, మట్టి | నాలుగవ రాజ్యము (దానియేలు 2:40) | రోమా సామ్రాజ్యం క్రీ.పూ. 133 -క్రీ॥శ 476 |
| ప్రతిమను విరుగ గొట్టిన రాయి | యుగముగములు నిలుచు రాజ్యం (దానియేలు 2:44) | క్రీస్తు రాజ్యము - అదే ఆయన సంఘము క్రీ.శ. 33 నుండి అంతము వరకు |

క్రీస్తు సువార్తకు విధేయులైతే దేవుని రాజ్యములో మీరు శాశ్వతమైన పౌరులు కాగలరు. (యోహాను 3:3-5; మార్కు 16:16 అ.కార్యములు 2:38; 8:35-39; గలతీ 8:26,27). "మన పౌరస్థితి పరలోక మందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసు క్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టు కొనియున్నాము. సమస్తమును తమకు లోబరచు కొనజాలిన శక్తినిబట్టి ఆయన మన దీన శరీరమును తమ మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును" (ఫీలిప్పీ 3:20,21). యేసు తన రాజ్యమును దేవునికి అప్పగించును. ఆయన రాజ్యము అంతము లేనిదై యుండును (లూకా 1:33; 1 కొరింథీ 15:24; ప్రకటన 11:15).

-రోయస్ ఫ్రెడరిక్

చాటుచున్నారు.

మార్చి 17వ తేదీ సాయంత్రం వాడపల్లిలో సువార్త కూటము జరిగెను. ఆ కూటమునకు రిక్కీగూటం గారు, జెర్రీబేట్స్ దంపతులు హాజరై వాక్యపరిచర్య చేయగా ఒకరు క్రీస్తులోనికి బాప్తీస్మము పొందెను. వాడపల్లిలోను, గొల్లవిల్లిలోను సోదరులు డి. రంగారావు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మార్చి 18వ తేదీ గురువారం సత్యవాణి క్రీస్తు సంఘ అవరణలో సువార్తికుల సదస్సు జరిగెను. ఆ సదస్సుకు పలు జిల్లాల నుండి సువార్తికులు హాజరైరి. ఆసదస్సులో రిక్కీగూటం గారు, ఎలిషే ప్రభాకరరావు గారు, జెర్రీబేట్స్ గారు వాక్యపరిచర్య చేసిరి. బేట్స్ గారు క్రైస్తవ నాయకత్వపు లక్షణములను గూర్చి ఉపన్యసించిరి. సంఘములో స్త్రీలు, పురుషులు కూడా అయా పరిధులలో నాయకత్వము వహించగలరు. ముఖ్యముగా సంఘనాయకులుగా యుండుగోరు పురుషులు సామర్ధ్యము కలిగి యుండాలి. దైవభక్తి కలిగి సత్యమునందాసక్తి కలిగిన వారై ఉండాలి. తదు పరివారు ధనాపేక్షలేనివారై, పరిచర్యచేయుటకు ఆసక్తి కలిగిన వారై యుండాలని బేట్స్‌గారు బోధించిరి. జాషువాగారు ఉదయకాలపు సమావేశములో తర్జుమాచేసిరి. రిక్కీగారి వందన సమర్పణతోను, డి.యెషయా గారి ప్రార్ధనతోను సదస్సు విజయవంతముగా ముగిసెను.

మార్చి 19వ తేదీ శుక్రవారం అడ్డతీగల మండలం పులుగోగులపాడులో సువార్త కూటము జరిగెను. జెర్రీబేట్స్ గారు, రిక్కీగారు తదితర సువార్తికులు హాజరై వాక్య పరిచర్యచేసిరి. 13 మంది క్రీస్తులోనికి బాప్తీస్మముపొందిరి. అక్కడ వి.సొలొమోను రాజుగారు పలు సంవత్సరాలుగా మతశాఖల దరపున పనిచేసి, సత్యమును గ్రహించిరి. అనాడు బాప్తిస్మము పొందిన వారిలో అయన ప్రధముడు. సొలొమోను రాజుగారు క్రీస్తు కొరకు అయన సంఘము కొరకు చేయు కృషిని దేవుడు దీవించునుగాక.

మార్చి 22వ తేదీ మంగళవారం రాత్రి సోదరులు పులగల సుందర్రావు గారు ప్రభువునందు నిద్రించిరి. అయన రామచంద్రపురం అగ్రహారంలోను, ఓదూరులోను బలమైన పరిచర్యచేసి సంఘములు స్థాపించిరి. 23వ తేదీనాడు భూస్థాపన కార్యక్రమము జరిగెను.

## మీ కొరకు గొప్ప సదవకాశం

సత్యవాణి ద్వారా ప్రచురింపబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పుడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును . గాని మీరు 85/- రూ॥లు మాత్రమే. మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిలు విద్యార్థులకు, బోధకులకు, తర్ఫీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి:

***Satya Vani***

**#7-9-35, Sambamurty Street,**

**Kakinada - 533 004. Ph: 0884- 2363722**

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

SATYA VAKKU

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004